క్లుప్తంగా

కొనసాగుతున్న ఓటర్ల సర్వే

పర్చూరు (చినగంజాం): మండలంలో ఓటర్ల సర్వే కొనసాగుతోంది. బుధవారం పర్చూరు, ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామాల్లో స్థానిక తహసీల్దార్ సంధ్యశ్రీ ఇంటింటికి తిరిగి ఓటర్ల సర్వే నిర్వహించారు. నకిలీ ఓట్లు నమోదై ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా ఓటర్లు తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఆర్‌ఐ నాగలక్ష్మి, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఏల్చూరు విద్యార్థుల ప్రతిభ


విజేతలుగా నిలిచిన విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి): ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో మండలంలోని ఏల్చూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ పోటీల్లో గెలుపొందారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారా బాలయ్య అభినందించారు. విద్యార్థులు 21 రకాల ఆటల పోటీల్లో విజయం సాధించారు. 87 పాయింట్లు సాధించి ఓవర్ ఆల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. పీడీని ఎంఈవో కోటేశ్వరరావు అభినందించారు.

రామలింగేశ్వర దేవాలయం పునఃనిర్మాణం


నిర్మాణంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం

జె. పంగులూరు: మండలంలోని జనకవరంలో శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర దేవాలయాన్ని గ్రామస్తుల సహకారంతో పునఃనిర్మాణం చేపట్టారు. ఆలయ నిర్మాణం రూ. 1.50 కోట్లు వ్యయం అవుతుందని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఆలయం మొత్తం రాతి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికి రూ. 50 లక్షల వ్యయంతో ఆలయం నిర్మాణం 70 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. ఆలయంపై గోపురం నిర్మాణం, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని తెలిపారు.

హైస్కూల్‌కు కుర్చీల వితరణ


కుర్చీలతో హెచ్‌ఎం

వేటపాలెం: మండల పరిధిలోని అక్కాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కుర్చీలను వితరణగా బుధవారం అందజేశారు. హెచ్‌ఎం భవనం భద్రిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను కోట్ల నిధులు ఖర్చు చేసి నాడు నేడు పథకం కింద అభివృద్ధి చేస్తుందని గుర్తు చేశారు. అయితే ఇటీవలే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అప్ గ్రేడ్ చేందిన పాఠశాలకు తగినంత ఫర్నిచర్ లేక పోవడంతో పాఠశాల్లో పనిచే ఉపాధ్యాయులు సహాయ సహకారంతో కొత్తగా కుర్చీలు కొనుగోలు చేసి అందించారని తెలిపారు. ఉపాధ్యాయులు కరోడి శ్రీనివాసరావు, యం. జయరావు, శ్రీనివాసరెడ్డి, అనూరాధ, అంజమ్మ, బాలసుబ్రహ్మణ్యం, ఖమరున్నీసా బేగం పాల్గొన్నారు.

ఇ- పంట నమోదు


బూదవాడలో ఇ- పంట నమోదు

జె. పంగులూరు: మండల పరిధిలోని బూదవాడలో బుధవారం ఇ- పంట నమోదు కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇ- పంట నమోదు చేసుకోవటం వలన ఉచిత పంటల బీమా పథకం, పంటకొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనుటకు, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగినప్పుడు సున్నావడ్డీ పథకం, రైతు భరోసాకు ఇ- పంటను ప్రామాణికంగా తీసుకోవచ్చన్నారు.

225 మందికి వైద్య పరీక్షలు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ఇడుపులపాడులో బుధవారం 225 మందికి ఒంగోలు కిమ్స్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రెవరెండ్ జి. సంజయ్‌కుమార్, గ్రామ పెద్దలు, బీఆర్ అంబేడ్కర్ యూత్ సహకారంతో స్థానిక లూథరన్ చర్చి ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫి , డాక్టర్ వినీల్, రాణి, కిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.


చినగంజాం: నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళుతున్న మున్నం వారిపాలెం విగ్రహం


చీరాల: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


వేటపాలెంలో నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు

ఉత్సాహంగా నిమజ్జనం


చీరాల: భరతనాట్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు


అద్దంకిలో డాలీ ప్యాకెట్లతో వినాయకుడి పందిరి అలంకరణ


మార్టూరు కాకతీయ నగర్ కాలనీలో..


చెన్నుపల్లి లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


వాడరేవులో బందోబస్తు చేస్తున్న మెరైన్, సివిల్, ఫైర్ పోలీసు సిబ్బంది

వేటపాలెం: జై గణేష్ మహారాజ్‌కీ జై.. నినాదాలు మారుమోగాయి. గణనాథుని విగ్రహాలు సముద్రతీరాలకు బుధవారం తరలివెళ్లాయి. గులాములు చల్లుకుంటూ ఆనందోత్సాహాల నడుమ గణపయ్య విగ్రహాలను నిమజ్జనం కోసం సముద్రతీరాలకు తరలించారు. భక్తులతో మూడు రోజులు ప్రత్యేక పూజలు, అలంకరణలు అందుకున్న గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి మండల పరిధిలోని పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామాపురం సముద్రతీరాలకు నిమజ్జనానికి తరలించారు. సంతరావూరు, ఇంకొల్లు ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను ట్రాక్టర్లపై వేటపాలెం ప్రాంతాల్లో సముద్రతీరాలకు తీసుకొచ్చారు.

మార్టూరు: వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం మండలంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూడళ్ళ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక కాకతీయ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మహిళా భక్తులు కుంకుమ పూజ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు.

బల్లికురవ: మండలంలోని బల్లికురవ, చెన్నుపల్లి, గ్రానైట్ ఈర్లకొండ, మల్లాయపాలెం, ఉప్పుమాగులూరు నక్కబొక్కలపాడు బొల్లాపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను బుధవారం నిమజ్జనానికి తరలించారు. డప్పు వాయిద్యాలు, పాట కచేరీల మధ్య తరలించారు.

చినగంజాం: వమున్నం వారిపాలెం, పూలవారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెంలో విగ్రహాలను పల్లెపాలెం బాపయ్య నగర్ సముద్ర తీరం, మోటుపల్లి వాడరేవు, పెద్దగంజాం వాడరేవు ప్రాంతాలకు తరలించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

చీరాల టౌన్: గణనాథులను ఊరేగింపుల అనంతరం స్ట్రయిట్ కట్ కాలువలో నిమజ్జనం చేస్తున్నారు. పర్చూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని బొమ్మలను వాడరేవు తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. చీరాల డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో మెరైన్ ఎస్సై సుబ్బారావు, సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

చీరాల: బెస్తపాలెంలో కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శనలు అలరించాయి. అబ్బురపరిచే ఘట్టాలను చిన్నారులు ప్రదర్శిస్తూ తమ ప్రతిభను కనబరిచారు. చీరాలలో ఎంతో వైభవంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

బ్యాంకు మేనేజర్ వ్యవహారంపై విచారణ


కొణిదెన విచారణ చేపడుతున్న ఆర్‌ఎం

బల్లికురవ: ప్రభుత్వం మంజూరు చేసే వివిధ రకాల సబ్సిడీ రుణాలు పంట రుణాలకు బ్యాంకు మేనేజర్ ప్రయివేటు వ్యక్తి ద్వారా కమిషన్‌లు దండుకుంటున్నారని, ఇవ్వకపోతే రుణాలు మంజూరు చేయటం లేదని వీవోఏ ఖాతాదారులు చీఫ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రీజనల్ మేనేజర్ బుధవారం సాయంత్రం బ్యాంకులో విచారణ చేపట్టారు. వివరాల్లోని వెళితే.. మండలంలోని కొణిదెన గ్రామంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ అయ్యప్ప కుమార్ 15 నెలల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి పనికీ 20 నుంచి 30 శాతం కమిషన్‌తో పాటు ఖాతాదారులతో సైతం అమర్యాదగా, దురుసుగా మాట్లాడుతున్నారని వేమవరం గ్రామ వీవోఏ చల్లగుళ్ల భవాని మరో నలుగురు ఖాతాదారులు ఆన్‌లైన్‌లో చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. గుంటూరు రీజనల్ మేనేజర్ గోపాలరావు విచారణ చేపట్టారు. రుణాలకు ఎలాంటి పర్సంటేజీలు చెల్లించాల్సిన పనిలేదని సిబిల్ స్కోర్ బాగుంటే ఏ ఖాతాదారుడికైనా రుణం మంజూరు చేస్తామని ఆర్‌ఎం వివరించారు.

విద్యుత్ స్తంభాలు తొలగింపునకు సహకరించండి


పి.గుడిపాడు సమీపంలో విద్యుత్ లైన్లు పరిశీలిస్తున్న అధికారులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన విమానాలను అత్యవసరంగా ల్యాండింగ్ చేసేందుకు నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సుశీల రైతులను కోరారు. కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయరహదారి సమీపంలోగల విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారులు, ఎన్‌హెచ్ 16 అధికారులతో పాటు అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు తహసీల్దార్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ విమానాలను అత్యవసర ల్యాండింగ్ చేసే సమయంలో విద్యుత్ లైన్లు అడ్డంకిగా ఉన్నందున నూతనంగా విద్యుత్ వైర్లను భూమిలో వేసేందుకు గాను స్తంభాలను తొలగించే కార్యక్రమానికి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్లు పద్మావతి, సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం


జీవామృతం చూపిస్తున్న డీపీఎం వాణిశ్రీ


గుడ్డు అమినో యాసిడ్ తయారీ..

పర్చూరు (చినగంజాం): మిరప బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని పర్చూరు డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రెనర్ సీహెచ్ అప్పారావు అన్నారు. నూతలపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలో మిరప రైతులకు మొలచిన మిరప మొక్కలకు బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో గుడ్డు అమినో యాసిడ్ బాగా ఉపకరిస్తుందని బుధవారం వివరించారు. ఎకరాకు 12 కోడిగుడ్లు, 30 నిమ్మకాయలు, అర కేజీ బెల్లం తీసుకొని, నిమ్మకాయ రసం తీసి ఒక పాత్రలో పోసి ఆ రసంలో కోడి గుడ్లు పెట్టాలని అలా 7 రోజులు ఉంచిన తరువాత అరకేజీ బెల్లం వేడి నీటితో కలిపి ఆ నీళ్ళను ఆ పాత్రలో పోసి.. కలిపిన ద్రావణాన్ని 15 రోజులు ఉంచితే సిద్ధమవుతుందన్నారు. పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు, నాణ్యమైన పంట, ప్రజలకు మంచి ఆహారం, ఆరోగ్యం సమకూరుతుందని తెలియజేశారు. జి. శ్రీనివాసరావు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అవగాహన

వేటపాలెం: గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని ఏపీ సీఎస్ఎఫ్ డీపీఎం వి. వాణిశ్రీ సూచించారు. కొత్తపాలెంలో వేరుశనగ పంటతో పాటు పందిళ్లపల్లిలోని వివిధ ప్రాంతాల్లో వరి పంటలను పరిశీలించారు. ఏఓ ఐ. కాశీవిశ్వనాథ్, వీఏఏలు జ్యోతి, చెన్నయ్య, డీపీఎంయూ ఎన్ఎఫ్ఏ లక్ష్మి, ప్రియ, పి. భారతి పాల్గొన్నారు.

నేడు పీహెచ్‌సీ పరిశీలన

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్ర ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్ గురువారం మధ్యాహ్నం ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఈమేరకు ఆయన వ్యక్తిగత కార్యదర్శి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులను పరామర్శిస్తారని చెప్పారు.

జేఏఎస్ సర్వే విజయవంతం

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ తెలిపారు. బుధవారం ఉప్పుమాగులూరు సచివాలయంలో సర్వేను పరిశీలించారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వ పథకాలు

చీరాల టౌన్: అన్నదాతలకు అండగా నిలవడంతో పాటుగా ఆపన్న హస్తం అందిస్తున్నదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలను ఆదుకుంటున్నారని వ్యవసాయ సలహామండలి చైర్మన్ కె.రమణారెడ్డి అన్నారు. బుధవారం కావూరివారిపాలెంలోని నక్కలవారిపాలెంలో స్ప్రింకర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులపంట భూములను ఆర్‌బీకే, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. సలహామండలి చైర్మన్ మాట్లాడారు. డ్రిప్ ఇరిగేషన్ రాయితీ పరికరాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాస్‌పుస్తకం, 1బి, తదితర దరఖాస్తులు అందించాలన్నారు. ఆర్‌బీకే అధికారి హిమేలియా, రైతులున్నారు.

నేడు వైఏ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్ రమణమ్మ తెలిపారు. అమెజాన్ కంపెనీలో ప్రొడక్షన్ ఆపరేటర్స్, స్మార్ట్ మొబైల్ కంపెనీలో అసెంబ్లెర్లుగా పనిచేయడానికి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18–35 సంవత్సరాల వయస్సు లోపు మహిళల్లో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 10 గంటలకు జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మార్టూరులో అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం కళాజాత

మార్టూరు: పర్యావరణ పరిరక్షణతో మనం ఆరోగ్యంగా జీవించటమే కాక భవిష్యత్ తరాలకు మెరుగైన సమాజాన్ని అందించిన వారమవుతామని మార్టూరు ఎంఎస్ఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రూత్ మెర్సీ జాయ్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే ప్లాస్టిక్ నిషేధం, బాలకార్మిక వ్యవస్థ,బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు తదితర అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

25 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

మార్కాపురం టౌన్: ఈ నెల 25, 26, 27వ తేదీల్లో మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్, పాఠశాల పీడీ ఎం.జాహ్నవి ప్రియ తెలిపారు. బుధవారం పాఠశాలలో సమీక్ష సమావేశం అనంతరం పోటీల వివరాలు వెల్లడించారు. మండల స్థాయిలో అండర్–14– అండర్–17 విభాగాల్లో ఎంపిక చేసిన జట్లను పోటీల్లో పాల్గొనేలా చూడాలని పీఈటీలు, పీడీలను కోరారు. మంత్రునాయక్, రమణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

- కౌన్సిల్ సాధారణ సమావేశంలో 4 అంశాలు రద్దు, ఒక అంశం వాయిదా


కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల: పట్టణంలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మున్సిల్ ఆమోదం తెలిపింది. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. జీరో అవర్‌లో వార్డుల్లోని పలు సమస్యలపై కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తెచ్చారు. గతంలో కౌన్సిల్ సభ్యులు లేవనెత్తిన పలు సమస్యకు పరిష్కారం కాలేదని కౌన్సిల్ సభ్యులు ఆరోపించారు. చైర్మన్ మాట్లాడుతూ వార్డుల్లోని సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. 37 అంశాల్లో నాలుగు అంశాలను రద్దు చేయగా ఒక అంశాన్ని వాయిదా వేశారు. 32 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, టీపీఓ లక్ష్మి, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యం


మాట్లాడుతున్న బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య

చీరాల టౌన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగులను ఉద్యోగులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పనిచేస్తున్నారని బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య అన్నారు. ఈపురుపాలెంలోని ఎస్‌కేబీఎం ఐటీఐ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మినీ జాబ్ మేళాను నిర్వహించారు. బీసీ కమిషన్ మెంబర్ ముసలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ సత్తార్, కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలసదేవరాజ్,కె.వీరయ్య,ఎస్.కోటేశ్వరరావు, ఉపాధి కల్పన కార్యాలయం ప్రతినిధి సౌగంధి పాల్గొన్నారు.

చెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకోండి


పంచాయితీ కార్యదర్శికి వినపతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చీరాల: వేటపాలెం మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వందేళ్ల చరిత్ర ఉన్న మర్రిచెట్టును నరికిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యదర్శి రమేష్ బాబుకు వినతి పత్రాన్ని అందించారు. ఎవరైనా చనిపోతే వారి దహన క్రతువులు నిర్వహించేందుకు మర్రిచెట్టు వద్ద పూర్వీకుల నుంచి వినియోగిస్తున్నారన్నారు. అక్కడ ఉన్న భూములను అమ్ముకునేందుకు చెట్టు అడ్డమైందనే నెపంతో కొందరు బలమైన నేతలు అండతో ఈ దారుణానికి పాల్పడ్డారన్నారు. చెట్టును నరికేందుకు పంచాయతీ అనుమతులు ఇవ్వలేదని, శనివారం జరిగిన ఘటనపై గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని, దుండగులపై పోలీసు కేసు కూడా నమోదు జరిగిందని ఆయన తెలిపారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన


జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ తదితరులు

చినగంజాం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె. స్వరూపరాణి అన్నారు. బుధవారం మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీలో మండల పరిషత్ కార్యాలయం బృందం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందుకోసం గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి పథకంపై ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ అద్దూరి సోవమ్మకు ఆరోగ్య సురక్ష బ్రోచర్లను అందజేశారు. ఈఓపీఆర్డీ వేణు, కార్యదర్శి ఉషా నాగేశ్వరి, జీవీవీ రాఘవరెడ్డి, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైన కొమరోలు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్తేర్ మేరీ, పీఈటీ సతీష్

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, సర్వైట్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడంతో పలువురు అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షేక్ ఖాజారహంతుల్లా డిస్కస్ త్రో, షాట్‌పుట్ త్రోలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అండర్–18 విభాగంలో పోటీలు నిర్వహించారు. కిశోర్ 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా సర్వైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఎంవీ అనుప్రియ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీకాంత్ 2 వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. భరత్ 100 మీటర్ల పరుగు పందెంలో లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలువగా ఎం.శ్రీచరణ్ హైజంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్తేర్ మేరి తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


విద్యార్థి వెంకటేశ్వర్లుతో ఉపాధ్యాయులు

పెద్దారవీడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి వి.వెంకటేశ్వర్లు రాష్ట్రస్థాయిలో బాల్‌బ్యాడ్మింటన్ ఆడేందుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కనకదుర్గ బుధవారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరచారని, చిత్తూరు జిల్లాలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని పీడీ పి. దామోదరరెడ్డి పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థి వెంకటేశ్వర్లును ఎస్ఎంసీ చైర్మన్ అల్లు లక్ష్మీగోవిందరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com